క్లుప్తంగా

హుస్సేన్‌పూర్ ప్రాథమిక పాఠశాల వార్షికోత్సవం



విద్యార్థులతో కొడంగల్, దౌల్తాబాద్ ఎంఈఓలు రాంరెడ్డి, వెంకటస్వామి

కొడంగల్ రూరల్: మండల పరిధిలోని హుస్సేన్‌పూర్ ప్రాథమిక పాఠశాల వార్షికోత్సవ వేడుకలను గురువారం విద్యార్థులు ఉల్లాసంగా, ఉత్సాహంగా జరుపుకున్నారు. ఈ సందర్భంగా విద్యార్థులు నిర్వహించిన సాంస్కృతిక కార్యక్రమాలు ఎంతగానో అలరించాయి. ప్రతిభ చాటిన విద్యార్థులకు ఎంఈఓ రాంరెడ్డి, దౌల్తాబాద్ ఎంఈఓ వెంకటస్వామి, హస్నాబాద్ కాంప్లెక్స్ హెడ్ మాస్టర్ నర్సిములు, పెద్దనందిగామ ఎల్ఎఫ్ఎల్ హెడ్ మాస్టర్ రాజారత్నం, మాజీ సర్పంచు ఆశప్ప, పాఠశాల హెచ్ఎం క్రాంతికుమార్, ఉపాధ్యాయురాలు సంధ్య విద్యార్థులను అభినందించారు.

దాహార్తిని తీర్చేవి చలివేంద్రాలు

తహసీల్దార్ విజయకుమార్



చలివేంద్రాన్ని ప్రారంభిస్తున్న తహసీల్దార్ విజయకుమార్

కొడంగల్ రూరల్: బాటసారుల దాహార్తిని తీర్చేవి చలివేంద్రాలని తహసీల్దార్ విజయకుమార్ పేర్కొన్నారు. పెరుగుతున్న ఎండలకు బాటసారులు చలివేంద్రాన్ని సద్వినియోగం చేసుకోవాలని తహసీల్దార్ విజయకుమార్ తెలిపారు. గురువారం తహసీల్దార్ కార్యాలయ ఆవరణలో రెవెన్యూ సిబ్బందితో కలిసి చలివేంద్రం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎండ తీవ్రతను దృష్టిలో ఉంచుకొని ప్రతిఒక్కరూ జాగ్రత్తలు పాటించాలని తెలిపారు. బాటసారులకు చలివేంద్రాలు కొంత ఉపశమనం కలిగిస్తాయన్నారు. వడ దెబ్బ తగలకుండా ముందస్తు జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో రెవెన్యూ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

శుభాకాంక్షలు తెలిపిన బీజేపీ నాయకులు



శుభాకాంక్షలు తెలుపుతున్న నాయకులు

అనంతగిరి: ఎమ్మెల్సీలుగా విజయం సాధించిన అభ్యర్థులకు వికారాబాద్‌కు చెందిన పలువురు బీజేపీ నాయకులు హైదరాబాద్‌లోని బీజేపీ కార్యాలయంలో మర్యాదపూర్వకంగా కలిసి శుభాకాంక్షలు తెలిపారు. ఈ కార్యక్రమంలో ధార్మిక సెల్ జిల్లా ఇంచార్జి డాక్టర్ రాజశేఖర్, శంకర్, యాదగిరి, మోహన్‌రెడ్డి, సుధాకర్ ఆచారి తదితరులు పాల్గొన్నారు.

ఇంటి పన్నులు వెంటనే చెల్లించాలి

మున్సిపల్ కమిషనర్ ఖాజామొయిజుద్దీన్

మొయినాబాద్: మున్సిపాలిటీ పరిధిలోని ప్రజలు వెంటనే ఇంటి పన్నులు చెల్లించి అభివృద్ధికి సహకరించాలని మున్సిపల్ కమిషనర్ మహ్మద్ ఖాజామొయిజుద్దీన్ అన్నారు. గురువారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ.. కొత్తగా ఏర్పడిన మొయినాబాద్ మున్సిపాలిటీలో పెద్ద మొత్తంలో బకాయిలు ఉన్నాయన్నారు. గ్రామ పంచాయతీలుగా ఉన్నప్పుడు రూ.1కోటి వరకు పన్నులు వసూలయ్యాయని, ఇంకా రూ.2కోట్ల వరకు బకాయిలు ఉన్నాయని చెప్పారు. మార్చి 31వరకు పన్నుల వసూలుపై ప్రత్యేక దృష్టి పెడతామన్నారు. మున్సిపాలిటీ పరిధిలోని ప్రజలు సహకరించి ఈ నెలాఖరు వరకు ఇంటి పన్నులు చెల్లించాలని కోరారు.

ఆ పాఠశాలలపై చర్యలు తీసుకోవాలి

శంకర్‌పల్లి: పట్టణంలోని శ్రీ చైతన్య, మాస్టర్ మైండ్ పాఠశాల యాజమాన్యాలపై అధికారులు చర్యలు తీసుకోవాలని ఎస్ఎఫ్ఐ చేవెళ్ల డివిజన్ అధ్యక్షుడు శ్రీనివాస్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఆయన గురువారం ఒక ప్రకటనలో మాట్లాడుతూ.. ఈ రెండు పాఠశాలలకు ప్రభుత్వం నుంచి ఎలాంటి గుర్తింపు లేకున్నప్పటికీ విద్యార్థులను చేర్చుకొని పాఠశాలలు నడిపిస్తున్నారని ఆరోపించారు. ఈ పాఠశాలలకు సరైన బిల్డింగ్స్, మైదానాలు, ఫైర్ సేఫ్టీ, క్వాలిఫైడ్ టీచర్లు సైతం లేరన్నారు. ఈ పాఠశాలలను విద్యాశాఖ అధికారులు పట్టించుకోకపోవడం బాధాకరమని, దీనిపై కలెక్టర్‌కు ఫిర్యాదు చేయనున్నట్లు స్పష్టం చేశారు.

నిబంధనలు గాలికి..!

రియల్టర్లతో అధికారుల కుమ్మక్కు

- పుట్ట గొడుగుల్లా పుట్టుకొస్తున్న ఫాం లేఅవుట్స్
- నాలా కన్వర్షన్ చేయకుండానే ప్లాట్లు చేసి విక్రయాలు
- పంచాయతీ అనుమతులు లేకుండానే లే అవుట్లలో బీటీ రోడ్లు, నిర్మాణాలు
- అధికారుల తీరుతో ప్రభుత్వ ఆదాయానికి గండి
- మిన్నకుంటున్న రెవెన్యూ పంచాయతీ, టౌన్ ప్లానింగ్ అధికారులు



తుమ్మలపల్లి రెవెన్యూ పరిధిలో అనుమతి లేకుండా సిద్ధం చేసిన ఫాం లే అవుట్లు

వికారాబాద్: వెంచర్లకు అనుమతులు, అక్రమ నిర్మాణాల విషయంలో రియల్టర్లు యథేచ్ఛగా నిబంధనలు తుంగలో తొక్కేస్తున్నారు. అధికారులు మాత్రం చూసి చూడనట్టు వ్యవహరిస్తున్నారు. విమర్శలు, ఆరోపణలు వస్తే మాత్రం నామమాత్రపు చర్యలు, నోటీసులు ఇచ్చి సరిపెడుతున్నారు. ఫిర్యాదులు అందిన సమయంలో నోటీసులు ఇచ్చి చేతులు దులుపుకుంటున్నారు. ఇంకా ఎవరైనా వత్తిడి చేస్తే తప్పా చర్యలు శూన్యం. ఇప్పటి వరకు గ్రామ పంచాయతీలు, మున్సిపాలిటీల్లో అక్రమ లేఅవుట్లే ఉండేవి. ప్రస్తుతం రైతులు, రైతులకు మేలు చేసే చట్టాలను వాడుకుంటూ ఫాం లేఅవుట్లు ఏర్పాటు చేస్తూ ప్రభుత్వ ఖజానాకు గండి కొడుతున్నారు. నాలా కన్వర్షన్ చేయకుండా వ్యవసాయ భూములను ప్లాట్లు చేసి అమ్మేస్తున్నారు. ఏకంగా పొలాల్లో బీటీ రోడ్లు, సీసీ రోడ్లు వేసి నిబంధనలు పాటించకుండా చట్టానికి తూట్లు పొడుస్తున్నారు. అనుమతులు లేకుండా పర్మినెంట్ నిర్మాణాలు చేపడుతున్నారు. కొన్ని చోట్ల చెరువులు, నాళాలు సైతం కబ్జా చేస్తున్నారు. ఈ విషయంలో రెవెన్యూ, పంచాయతీ, టౌన్ ప్లానింగ్ అధికారులు చూసి చూడనట్టు వ్యవహరిస్తున్నారు.

గజాల్లో విక్రయం.. గుంటలలెక్క రిజిస్ట్రేషన్..

వ్యవసాయ భూములు ప్లాట్లు చేయాలన్నా, గజాల్లో విక్రయించాలన్నా ముందుగా ఆ భూమికి సంబంధించి నిర్దేశిత రుసుము చెల్లించాలి. అనంతరం వ్యవసాయేతర భూమి కన్వర్షన్ చేసుకోవాలి. నాలా తరువాత ఆ భూములు వ్యవసాయ భూముల నుంచి కమర్షియల్ పర్పస్ ల్యాండ్‌గా మారుతుంది. అయితే వ్యవసాయ యోగ్యంగా లేని భూములు మాత్రమే నాలా కన్వర్షన్ చేయాలనే నిబంధన కూడా ఉంది. కాగా నాలా కన్వర్షన్ చేయకుండానే జిల్లాలో పలు చోట్ల భూములను గజాల్లెక్కన విక్రయించి గుంటల చొప్పున రిజిస్ట్రేషన్ చేయించుకుంటున్నారు.

చూసిచూడనట్టు వ్యవహరిస్తున్న అధికారులు..

అవకతవకలకు అడ్డుకట్ట వేయాల్సిన అధికారులు చూసిచూడనట్టు వ్యవహరిస్తున్నారు. కొన్ని చోట్ల అవకతవకలకు పాల్పడుతున్న రియల్టర్లతో అధికార యంత్రాంగం కుమ్మక్కయ్యారనే ఆరోపణలు వినిపిస్తున్నాయి. కొన్ని జీపీలతో పాటు, మున్సిపల్ పరిధిలో కూడా ఫాం హౌస్‌ల పేరుతో పంచాయతీల అనుమతులు లేకుండానే పెద్దపెద్ద నిర్మాణాలు చేపడుతున్నారు. ఈ విషయంలో సంబంధిత అధికారులు పట్టించుకోవడంలేదు. భూమిని నాలా కన్వర్షన్ చేయకుండా అందులో రోడ్లు వేసి గజాల్లో విక్రయిస్తూ గుంటల్లో రిజిస్ట్రేషన్లు చేయించుకుంటున్నారు. మరికొన్ని చోట్ల వ్యవసాయ భూమిని ఫాం లే అవుట్ల పేరుతో అభివృద్ధి చేసి ఐదు గుంటలు, 10 గుంటలు, అర ఎకరం చొప్పున విక్రయిస్తున్నారు. ఇలా వికారాబాద్ మున్సిపల్‌తో పాటు జిలాల్లో పలు చోట్ల ఈ తతంగం జరుగుతున్నా అధికారులు చూసిచూడనట్టు వ్యవహరించడంలో అంతర్యమేమిటని కొందరు ప్రశ్నిస్తున్నారు. వికారాబాద్ మున్సిపల్ పరిధిలోని కొత్రెపల్లి సమీపంలో సుమారు పదెకరాలకు పైగా ఫాం లేఅవుట్లు చేశారు. మర్పల్లి మండలంలోని తుమ్మలపల్లిలో, పరిగి మండలంలో, వికారాబాద్, నవాబుపేట, మోమిన్‌పేట, పూడూరు తదితర చోట్ల ఈ తతంగం యథేచ్ఛగా కొనసాగుతోంది. వికారాబాద్ మండల పరిధిలోని ద్యాచారం గ్రామంలో 20 ఎకరాలకు పైగా వ్యవసాయ భూమిలో రోడ్లు నిర్మించారు. చుట్టూ ప్రహరీ ఏర్పాటు చేసి ఫాం లేఅవుట్‌గా అభివృద్ధి చేస్తున్నారు. మండల పరిధిలోని పీరంపల్లి, సిద్దులూరు గ్రామాల పరిధిలో సైతం 130 ఎకరాల్లో ఇలాంటి ఫాంలేఅవుట్లే చేసి గజాల చొప్పున విక్రయిస్తూ గుంటల్లో రిజిస్ట్రేషన్లు జరిగిపోతున్నాయి.

చర్యలు తీసుకుంటాం..

జిల్లాకు చెందిన ఆయా మండలాల పరిధిలోని పలు గ్రామాల్లో అనుమతులు లేకుండా లేఅవుట్లు చేస్తున్నట్టు మా దృష్టికి కూడా వచ్చింది. కొన్ని గ్రామ పంచాయతీల పరిధిలో మా పంచాయతీ కార్యదర్శుల చేత నోటీసులు కూడా ఇచ్చాం. కొన్ని చోట్ల ఇప్పటికే మూడుసార్లు నోటీసులు అందజేశాం. వారు స్పందించకుంటే తదుపరి చర్యలు తీసుకుంటాం. కొన్ని చోట్ల నిర్మాణాలు కూడా కూల్చివేయించాం. ఎక్కడయినా పంచాయతీ కార్యదర్శుల పాత్ర ఉన్నట్టు తేలితే వారిపైన కఠిన చర్యలు తీసుకుంటాం. కలెక్టర్‌కు ఫిర్యాదు చేస్తాం.

– జయసుధ, డీపీఓ, వికారాబాద్

భగీరథ పైపులైన్‌కు మరమ్మతులు

సాక్షి ఎఫెక్ట్..



మొరంగపల్లి నుంచి ఎన్కేపల్లి వెళ్లే దారిలో మరమ్మతులు చేయిస్తున్న అధికారులు

మోమిన్‌పేట: భగీరథ పైపునకు లీకేజీ అనే శీర్షికతో గురువారం సాక్షిలో ప్రచురితమైన వార్తకు అధికారులు స్పందించారు. మండల పరిధిలోని మొరంగపల్లి నుంచి ఎన్కేపల్లి వెళ్లే భగీరథ పైపులైన్‌కు రెండు వేర్వేరు ప్రదేశాలలో లీకేజీ పడి తాగునీరు వృథాగా పోతుంది. దీంతో గ్రామస్తులకు వారం రోజులుగా సరిపడ నీరు సరఫరా కావడంలేదు. ఈ వార్తకు సంబంధిత అధికారులు స్పందించి గురువారం ఉదయం లీకేజీలకు మరమ్మతులు చేయించారు. సమస్యను పరిష్కరించారు.

కొత్త ట్రాన్స్‌ఫార్మర్‌తో తీరిన ఓల్టేజీ సమస్య



అదనపు ట్రాన్స్‌ఫార్మర్‌ను ఏర్పాటు చేస్తున్న సిబ్బంది

స్పీకర్‌కు కృతజ్ఞతలు తెలిపిన గ్రామస్తులు

ధారూరు: మండల పరిధిలోని స్టేషన్‌ధారూరు గ్రామంలో అస్తవ్యస్త విద్యుత్ సరఫరా, ఓవర్‌లోడ్‌తో త్రీఫేస్ సమస్య నెలకొందని గ్రామస్తులు ఆందోళన వ్యక్తం చేశారు. లోఓల్టేజీ సమస్య పట్టి పీడిస్తుందని, అదనంగా కొత్త ట్రాన్స్‌ఫార్మర్‌ను ఏర్పాటు చేయించాలని శాసనసభ స్పీకర్ గడ్డం ప్రసాద్‌కుమార్‌కు విన్నవించారు. స్పీకర్ ఆదేశాలతో గురువారం ట్రాన్స్‌కో సిబ్బంది కొత్త ట్రాన్స్‌ఫార్మర్‌ను ఏర్పాటు చేశారు. దీంతో గ్రామంలో లోఓల్టేజీ సమస్య, త్రీఫేస్ ఓవర్‌లోడ్ సమస్యలాంటి ఇబ్బందులు తొలగిపోయాయని మాజీ సర్పంచు తిరుపతయ్య, కాంగ్రెస్ నాయకులు యాదయ్య, గాజుల వాణి, సోమ్లానాయక్‌లు పేర్కొన్నారు. ఈ సందర్భంగా వారు స్పీకర్‌కు కృతజ్ఞతలు తెలిపారు. స్టేషన్‌ధారూరు గ్రామ విద్యుత్ సరఫరాపై ఓవర్‌లోడ్ పడిందని, దీనిని అధిగమించేందుకు అదనపు ట్రాన్స్‌ఫార్మర్‌ను ఏర్పాటు చేయించామని ట్రాన్స్‌కో ఏఈ వేణుగోపాల్‌రెడ్డి తెలిపారు.

వృథాగా మిషన్ భగీరథ తాగునీరు



ప్రభుత్వ జూనియర్ కళాశాల మైదానంలో వృథాగా పోతున్న తాగునీరు

- ఇబ్బందులు ఎదుర్కొంటున్న స్థానికులు
- పట్టించుకోని అధికారులు

తాండూరు టౌన్: ఎండాకాలం ప్రారంభం కావడంతో తాండూరు పట్టణంలోని పలు వార్డులకు రెండు రోజులకోసారి తాగునీటిని వదులుతున్నారు. అసలే నీటి ఎద్దడి కొనసాగుతుండగా వేలాది లీటర్ల తాగునీరు నేలపాలు అవుతున్నా సంబంధిత అధికారులు, సిబ్బంది ఎవరూ పట్టించుకోవడం లేదు. పట్టణంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాల మైదానంలోని ఓవర్ హెడ్ ట్యాంకు ద్వారా తాగునీరు సరఫరా చేస్తున్నారు. కొన్ని రోజులుగా ట్యాంకు వద్ద పైపులైను లీకేజీ అవ్వడంతో నీరు వృథాగా పోతుంది. దీంతో స్థానికులకు సక్రమంగా నీరు అందక ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. పైపులైన్ లీకేజీ విషయాన్ని సంబంధిత సిబ్బంది పట్టించుకోకపోవడంతో నీటి సరఫరాలో అంతరాయం ఏర్పడుతుంది. వెంటనే అధికారులు స్పందించి పైపులైన్‌కు మరమ్మతులు చేయించాలని ప్రజలు కోరుతున్నారు.

పేదలకు అండగా కేంద్ర ప్రభుత్వ పథకాలు



బాధిత కుటుంబానికి చెక్కు అందజేస్తున్న అధికారులు, బీజేపీ నేతలు

కుల్కచర్ల: పేదలకు అండగా కేంద్ర ప్రభుత్వ పథకాలు నిలుస్తున్నాయని బీజేపీ రాష్ట్ర కార్యవర్గసభ్యులు కరణం ప్రహ్లాదరావు, కేంద్ర టెలికాం అడ్వైజరీ కమిటీ మెంబర్ ఘనపురం వెంకటయ్య పేర్కొన్నారు. కుల్కచర్ల మండల కేంద్రానికి చెందిన కొమ్ము విష్ణు కుల్కచర్ల పల్లె సమగ్ర సేవా కేంద్రంలో ప్రధాన మంత్రి జీవనజ్యోతి బీమాకు దరఖాస్తు చేసుకున్నారు. ఇటీవల అకాలమరణం చెందడంతో గురువారం బాధిత కుటుంబానికి రూ.2లక్షల బీమా డబ్బులను అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. కేంద్ర ప్రభుత్వ పథకాలతో నిరుపేదలకు మేలు జరుగుతుందన్నారు. పేదలు జీవిత బీమా, ప్రమాద బీమాలు చెల్లిస్తే భవిష్యత్‌లో వారి కుటుంబాలకు అవి ఎంతో అండగా నిలుస్తాయని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో ఎస్బీఐ ఫీల్డ్ ఆఫీసర్ మదన్ మోహన్ రెడ్డి, దిశ కమిటీ సభ్యులు జానకిరాం, జిల్లా కౌన్సిల్ సభ్యులు కాటనిపల్లి ఆంజనేయులు, జిల్లా కార్యవర్గసభ్యులు గాదె మైపాల్, కుల్కచర్ల బీజేపీ మండల అధ్యక్షుడు గుడాల వెంకటయ్యముదిరాజ్, పల్లె సమగ్ర సేవా కేంద్రం నిర్వాహకురాలు సునీత, నాయకులు వెంకట్రాములు, అంజిలయ్య, బాలకృష్ణ, నర్సింలు తదితరులు పాల్గొన్నారు.

నిర్మించారు.. వదిలేశారు!



నూతన కిచెన్ షెడ్



పాత కిచెన్ షెడ్

- ప్రారంభానికి నోచుకోని కిచెన్‌షెడ్
- శిథిలావస్థకు చేరిన పాత షెడ్డు
- పట్టించుకోని అధికారులు

దుద్యాల్: కొన్ని పాఠశాలలో కిచెన్ షెడ్లు లేకపోవడంతో ఆరుబయట వంటలు వండుతున్నారు. మరికొన్ని చోట్ల నిర్మించిన కూడా వాటిని ఉపయోగించడం లేదు. దుద్యాల్ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో రూ.3,50,000లతో నిర్మించిన నూతన కిచెన్ షెడ్ ప్రారంభానికి నోచుకోలేదు. శిథిలావస్థకు చేరి కూలేందుకు సిద్ధంగా ఉన్నప్పటికీ పాత షెడ్‌లోనే వంటలు వండుతున్నారు. పాత భవనంలో వంటలు చేయడం ఇబ్బందికరంగా ఉన్నప్పటికీ ఎవరూ పట్టించుకోవడం లేదు. దీంతో కొత్త కిచెన్ షెడ్ ప్రారంభించాలని మధ్యాహ్న భోజనం వండే ఏజెన్సీలు కోరుతున్నారు. అధికారులు స్పందించి ప్రారంభిస్తే వంట వండే సరుకులు భద్ర పరుచుకునే అవకాశం ఉంటుందని అభిప్రాయం వ్యక్తం చేస్తున్నారు.

కొలతల ప్రకారం కూలి

ఎంపీడీఓ కరీం



పనులను పరిశీలిస్తున్న ఎంపీడీఓ కరీం

పరిగి: ఉపాధి హామీ కూలీలు కొలతల ప్రకారం పని చేస్తేనే రోజువారి కూలి అందుతుందని ఎంపీడీఓ కరీం పేర్కొన్నారు. గురువారం మండల పరిధిలోని సాలేపూలబాటతండాలో పర్యటించి ఉపాధి హామీ పనులను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఉపాధి కూలీలకు రోజువారి కూలి రూ.300లను ప్రభుత్వం అందిస్తుందన్నారు. పూర్తి కూలీ అందాలంటే కొలతల ప్రకారం పని చేయాలని సూచించారు. జాబ్ కార్డు కలిగిన ప్రతీ ఒక్కరికి పనులు కల్పించాలన్నారు. ఉపాధి హామీ పనులు జరుగుతున్న ప్రదేశాల్లో కూలీలకు అన్ని రకాల సౌకర్యాలను అందుబాటులో ఉంచాలని చెప్పారు. ఎండలు పెరుగుతున్న కారణంగా త్రాగునీరు అందుబాటులో ఉంచాలన్నారు. నీడా కోసం టెంట్లను ఏర్పాటు చేయాలని తెలిపారు. పనులపై నిర్లక్ష్యం చేయరాదని ఫీల్డ్ అసిస్టెంట్లకు సూచించారు. ఈ కార్యక్రమంలో టెక్నికల్ అసిస్టెంట్ ప్రభాకర్‌గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

అస్తిత్వానికి పోరాడుదాం

చేవెళ్ల: మాలల అస్తిత్వం కోసం అందరూ ఏకమై ఐక్యతతో కలిసి పోరాడాల్సిన అవసరం ఎంతైనా ఉందని మాల సంఘాల జిల్లా జేఏసీ నాయకులు అన్నారు. మండల కేంద్రంలో గురువారం మాల సంఘాల జిల్లా జేఏసీ సభ్యులు సమావేశమయ్యారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. మాలలపై జరుగుతున్న కుట్రలను, ఉనికి, వర్గీకరణ ముసుగులో మాలలపై జరుగుతున్న దాడులను తీవ్రంగా ఖండిస్తున్నట్లు తెలిపారు. ఎస్సీ వర్గీకరణ ముసుగులో మాలలను ద్రోహులుగా, దోషులుగా చిత్రీకరించటం సరికాదన్నారు. రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ పోరాటాల ద్వారా వచ్చిన రిజర్వేషన్ల అవకాశాలను అందిపుచ్చుకోవటమే తప్పు చేసినట్లుగా సమాజానికి చెప్పటం దురదృష్టకరమన్నారు. మాలల అస్తిత్వం కోసం మాలల్లోని మేధావులు, రాజకీయ నాయకులు, ఉద్యమకారులు విద్యార్థులు మేల్కొని ముందుకురావాలన్నారు. కాంగ్రెస్ ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీ మేరకు ఎస్సీ రిజర్వేషన్లను 18 శాతానికి పెంచాలని డిమాండ్ చేశారు. సమతా సైనిక్ దళ్ రాష్ట్ర ఉపాధ్యాక్షుడు ఎర్రుల మల్లేశ్, జిల్లా అధ్యక్షుడు రామస్వామి, మాల మహానాడు జిల్లా అధ్యక్షుడు మహేశ్, ఆలిండియా అంబేడ్కర్ సంఘం ఎం.శ్రీనివాస్, సత్యం, మహేశ్ పాల్గొన్నారు.

ఎమ్మెల్సీ ఎన్నికల్లో తపస్ అభ్యర్థుల విజయంపై హర్షం

బొంరాస్‌పేట: రాష్ట్రంలో తపస్ బలపర్చిన ఎమ్మెల్సీ అభ్యర్థులే విజయం సాధించారని తపస్ జిల్లా నాయకులు హర్షం వ్యక్తం చేశారు. గురువారం ఆ సంఘం జిల్లా నాయకులు బాకారం మల్లయ్య, బాకారం చంద్రశేఖర్ మాట్లాడుతూ విలేకరుల సమావేశంలో మాట్లాడారు. మూడు ఎమ్మెల్సీల్లో ఉపాధ్యాయ ఎమ్మెల్సీ అభ్యర్థి మల్క కొంరయ్య మొదటి ప్రాధాన్యత ఓటు, పట్టభద్రుల ఎమ్మెల్సీ అభ్యర్థి అంజిరెడ్డితో సహా ఇద్దరి గెలుపు తపస్ ఖాతాలో పడ్డాయని ధీమా వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా అక్కడి ఓటర్లకు సంఘ పక్షాన కృతజ్ఞతలు చెప్పారు.

ఎమ్మెల్సీలకు శుభాకాంక్షలు

చేవెళ్ల: ఎమ్మెల్సీ ఎన్నికల్లో బీజేపీ అభ్యర్థుల గెలుపుపై పార్టీ మండల అధ్యక్షుడు అత్తెల్లి అనంత్‌రెడ్డి హర్షం వ్యక్తం చేశారు. చేవెళ్లలో గురువారం ఆయన విలేకరులతో మాట్లాడారు. కరీంనగర్, నిజామాబాద్, అదిలాబాద్, మెదక్ నియోజకవర్గ పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల్లో భారీ విజయాన్ని కైవసం చేసుకున్న బీజేపీ అభ్యర్థి అంజిరెడ్డి, ఉమ్మడి మెదక్, నిజామబాద్, అదిలాబాద్, కరీంనగర్ ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఎన్నికలో గెలుపొందిన మల్క కొమురయ్యకు శుభాకాంక్షలు తెలిపారు. బీజేపీ అండగా నిలిచిన పట్టభద్రులు, ఉపాధ్యాయులు బీజేపీతోనే అభివృద్ధి అని నమ్ముతున్నారన్నారు. రెండు ఎమ్మెల్సీల విజయంతో రాష్ట్రంలో బీజేపీకి బలాన్ని చేకూర్చిందన్నారు. రాష్ట్రంలో రాబోయేది బీజేపీ పార్టీయేనని ఈ తీర్పులు సంకేతాలు అందించినట్లేనని తెలిపారు. రాబోయే స్థానిక సంస్థల ఎన్నికల్లో బీజేపీదే విజయమని ధీమా వ్యక్తం చేశారు. ఎమ్మెల్సీ ఎన్నికల్లో బీజేపీకి ఓట్లు వేసిన ప్రతి ఒక్కరికి కృతజ్ఞతలు తెలిపారు. ఈ ఫలితాలు అధికార పార్టీకి చెంప పెట్టులాంటివన్నారు. కాంగ్రెస్, బీఆర్ఎస్ పార్టీలను ప్రజలు నమ్మే పరిస్థితి లేదన్నారు.

రిజర్వాయర్ నిర్మాణంపై నిర్లక్ష్యం

ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్



మాట్లాడుతున్న ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్

షాద్‌నగర్: రాష్ట్రాన్ని పదేళ్లు పాలించిన బీఆర్ఎస్ ప్రభుత్వం లక్ష్మీదేవిపల్లి రిజర్వాయర్ నిర్మించకుండా పూర్తిగా నిర్లక్ష్యం చేసిందని ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ అన్నారు. గురువారం పట్టణంలోని క్యాంపు కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. గత ప్రభుత్వం పాలమూరు ఎత్తిపోతల పథకంలో భాగంగా షాద్‌నగర్ పరిధిలో లక్ష్మీదేవిపల్లి రిజర్వాయర్‌ను నిర్మిస్తామని హామీ ఇచ్చి విస్మరించిందన్నారు. రిజర్వాయర్ నిర్మాణానికి గత ప్రభుత్వం ఒక్క రూపాయి కూడా కేటాయించలేదని, తట్టెడు మట్టిని కూడా తీయలేదని విమర్శించారు. పదేళ్లు అధికారం అనుభవించిన కేసీఆర్ కుర్చీ వేసుకొని రిజర్వాయర్ నిర్మిస్తానని హామీ ఇచ్చి ఎందుకు నిర్మించలేదని ప్రశ్నించారు. రిజర్వాయర్ నిర్మాణం కాకుండా చేసింది మాజీ మంత్రి శ్రీనివాస్‌గౌడ్, మాజీ ఎమ్మెల్యే అంజయ్యయాదవ్ లేనని ఆరోపించారు. రిజర్వాయర్ నిర్మించకపోతే ఓట్లు అడగమని చెప్పిన అంజయ్యయాదవ్, నాటి ఎంపీ మన్నె శ్రీనివాస్‌రెడ్డిని ఈ ప్రాంత ప్రజలు ఎన్నికల్లో ఓడించారన్నారు. గత పాలకులు సొంత లాభం కోసం ప్రాజెక్టుల డీపీఆర్ మార్చారే తప్పా ఈ ప్రాంతానికి ఏ ప్రయోజనం చేయలేదని మండిపడ్డారు. ప్రాజెక్టుల అంశంపై రోజుకో మాట మాట్లాడుతున్న బీఆర్ఎస్ పార్టీ నాయకులను ప్రజలు నమ్మే పరిస్థితుల్లో లేరన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం చేస్తున్న అభివృద్ధి, సంక్షేమ పథకాలను చూసి ఓర్వలేక బీఆర్ఎస్ పార్టీ నేతలు అసత్య ప్రచారాలను చేస్తున్నారన్నారు. ప్రజలను మభ్యపెట్టేందుకు ఆ పార్టీ నేతలు చేస్తున్న కల్లిబొల్లి మాటలను ప్రజలు గ్రహిస్తున్నారన్నారు. సమావేశంలో మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ బాబర్‌ఖాన్, నాయకులు శ్రీకాంత్‌రెడ్డి, జంగ నర్సింహ, వెంకట్‌రాంరెడ్డి, శివశంకర్‌గౌడ్, ప్రియాంక, దామోదర్‌రెడ్డి, బాల్‌రాజ్‌గౌడ్, రఘునాయక్ పాల్గొన్నారు.

విద్యార్థి హత్య ఎంతో బాధాకరం

కేశంపేటకు చెందిన విద్యార్థి గంప ప్రవీణ్ అమెరికాలో దుండగుల కాల్పుల్లో హత్యకు గురికావడం ఎంతో బాధాకరమని ఎమ్మెల్యే శంకర్ అన్నారు. ఉన్నత విద్య అభ్యసించేందుకు విదేశాలకు వెళ్లిన విద్యార్థి హత్యకు గురికావడం తనను ఎంతో కలిచివేసిందన్నారు. ఈ సందర్భంగా ఆయన ప్రగాఢ సానుభూతిని, సంతాపాన్ని తెలిపారు.

రోడ్ల అభివృద్ధికి కృషి



దౌల్తాబాద్: భూమి పూజ చేస్తున్న తిరుపతిరెడ్డి, కడా అధికారి వెంకట్‌రెడ్డి

దౌల్తాబాద్: నియోజకవర్గంలో ప్రతి గ్రామానికి, మండల కేంద్రానికి రోడ్లు అభివృద్ధి చేయించేందుకు సీఎం రేవంత్‌రెడ్డి కృషి చేస్తున్నారని నియోజకవర్గ ఇన్‌ఛార్జి తిరుపతిరెడ్డి, కడా ప్రత్యేకాధికారి వెంకట్‌రెడ్డి పేర్కొన్నారు. గురువారం మండలంలోని దౌల్తాబాద్ నుంచి కోస్గి, దౌల్తాబాద్ నుంచి మద్దూరు వరకు మూడు లైన్ల రహదారికి భూమి పూజ చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఇప్పటికే ఏడాదిన్నర కాలంలో నియోజకవర్గంలోని అన్ని గ్రామాలకు బీటీ రోడ్లు మంజూరయ్యాయని వాటిని త్వరలో పూర్తి చేసేలా చర్యలు తీసుకుంటున్నామన్నారు. ముఖ్యమంత్రిగా కొడంగల్ నుంచి ప్రాతినిథ్యం వహించిన రేవంత్‌రెడ్డి ఎల్లప్పుడు నియోజకవర్గ అభివృద్ధే ధ్యేయంగా పనిచేస్తున్నారన్నారు. ఈ కార్యక్రమంలో వెంకట్రావు, వెంకట్‌రెడ్డి, వీరన్న, దస్తప్ప, రాములు, మహిపాల్, కృష్ణ, సేవ్యానాయక్, వెంకట్రాములు భీంరెడ్డి, రెడ్యానాయక్ తదితరులు పాల్గొన్నారు.

పలు అభివృద్ధి పనులకు భూమిపూజ..



కొడంగల్ రూరల్: రోడ్డు పనులకు పూజ చేస్తున్న తిరుపతిరెడ్డి

కొడంగల్ రూరల్: ఆర్అండ్‌బీ రోడ్ల అభివృద్ధికి ప్రభుత్వం చర్యలు తీసుకుంటుందని కాంగ్రెస్ నియోజకవర్గ ఇంచార్జ్ ఎనుముల తిరుపతిరెడ్డి పేర్కొన్నారు. గురువారం మండలంలోని కర్ణాటక చెక్‌పోస్టు దగ్గర కొడంగల్–గుల్బర్గా రోడ్డు నిర్మాణ పనులకు, అంగడిరాయిచూర్ నుంచి ఇమ్మాపూర్ రోడ్డుకు ధర్మాపూర్ దగ్గర, నేషనల్ హైవే163 నుంచి చిట్లపల్లి రోడ్డుకు దర్గా సమీపంలో ఆయన భూమిపూజ చేశారు. పనులు త్వరితగతిన ప్రారంభించాలని సంబంధిత కాంట్రాక్టర్లకు, అధికారులకు తెలిపారు. నియోజకవర్గంలోని ఆర్అండ్‌బీ రహదారులకు ప్రభుత్వం నిధులు మంజూరు చేసిందని, పనులను నాణ్యతతో చేపట్టాలని సూచించారు. ఈ కార్యక్రమంలో జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ రాజేష్‌రెడ్డి, మాజీ ఎంపీపీ ముద్దప్ప దేశ్‌ముఖ్, ఏఎంసీ చైర్మన్ అంబయ్యగౌడ్, కాంగ్రెస్ మండల అధ్యక్షుడు నందారం ప్రశాంతు, మాజీ సర్పంచులు వెంకట్‌రెడ్డి, సంజీవరెడ్డి పాల్గొన్నారు.